క్లుప్తంగా

ఆదిత్యునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతానగర్‌లోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ఈ.బొనంగిలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు. మండలంలో ఈ.బోనంగిలో రూ.1.50 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, సోలార్ సిస్టమ్ వంటి పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో గృహ వసతి లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు, స్థలాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువతకు స్థానిక ఫార్మా పరిశ్రమల్లో ఉపాధి కల్పించే దిశగా తాను అడుగులు వేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు, పంచాయతీరాజ్ డీఈ పి.వి.రమణమూర్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, కూటమి నాయకులు బుగిడి రామగోవిందరావు, అట్టా సన్యాసప్పారావు, కన్నూరు వెంకటరమణ, మంత్రి గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

పరవాడ: తిక్కవానిపాలెం గ్రామ శివార్లలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. నిందుతుల నుంచి పేక ముక్కలు, రూ.1450 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని చెప్పారు.


విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గాజువాక: గాజువాక హైస్కూల్ రోడ్ కృష్ణానగర్ కొండపై వేంచేసిన విజయ దుర్గాదేవి ఆలయ 11వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో విశేష హోమాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో భక్తులు వందలాదిగా పాల్గొన్నారు. పంచామృతాభిషేకం అనంతరం నూతన వస్త్రంతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణానగర్, జోగవానిపాలెం, బొజ్జన్నకొండ, పెంటయ్యనగర్, గణేష్‌నగర్ ప్రాంతాల నుంచి మహిళలు తెల్లవారు జామునే ఆలయానికి చేరుకొని అమ్మవారికి పసుపు కుంకమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గర్భ గుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ సన్నిధిలో వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ధర్మకర్తలు పల్లా కుమార్, పల్లా సురేష్, యలమంచిలి మణిలక్ష్మి తదితరులు వేడుకలను పర్యవేక్షించారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం చేయడం ప్రాణదానం చేసినంత గొప్ప కార్యమని కొనియాడారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పరవాడ..
గుండె దడ

- గంజాయి, మద్యం, పేకాట, ఆన్‌లైన్ గేమ్‌ల జోరు
- చీకటి పడితే తిరగలేకపోతున్నామని మహిళల ఆందోళన
- వ్యవసాయ భూముల్లో అసాంఘిక కార్యకలాపాలతో రైతుల ఇక్కట్లు



తిక్కవానిపాలెం తుపాను షెల్టర్ భవనం వద్ద విసిరేసిన పేక ముక్కలు



గంగునాయుడుపాలెం జీడితోటలో ఖాళీ బీరు సీసాలు, వాటర్ బాటిళ్లు, ఖైనీ ప్యాకెట్లు

పరవాడ: ఒకప్పుడు ఎంతో ప్రశాంతంగా ఉండే పరవాడ మండలం నేడు గంజాయి, పేకాట, ఆన్‌లైన్ గేమ్‌ల వంటి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఎక్కడ చూసినా గంజాయి, మందుబాబులు, పేకాట బ్యాచులకు అడ్డాగా మారిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, జీడి తోటలు గంజాయి, మందు బ్యాచ్‌లకు అడ్డాగా మారిపోయాయి. గంజాయి, మద్యం మత్తులో హత్యా సంస్కృతికి తెర లేపుతున్నారు. పగలురాత్రీ తేడా లేకుండా దర్జాగా పేకాట బ్యాచ్‌లు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. చీకటి పడితే చాలు ఆకతాయిలు చెట్టాపట్టాలేసుకుని రోడ్లపై నిర్మించిన కల్వర్టులు, ఖాళీగా ఉన్న లేఅవుట్లలో సిట్టింగ్‌లు వేస్తూ గంజాయి, బీర్లు సేవిస్తూ చెలరేగిపోతున్నారు.

ఇబ్బందుల్లో మహిళలు..

గంజాయి, మందు బ్యాచ్‌ల వల్ల రహదారులపై రాకపోకలు సాగిస్తున్న గ్రామీణ మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంజాయి, మద్యం మత్తులో చెలరేగిపోతున్న ఆకతాయిలు వైన్ షాపులు, పాన్ షాపుల వద్ద ఘర్షణలకు దిగుతూ రౌడీయిజానికి పాల్పడుతున్న ఘటనలు వాడచీపురుపల్లి, దేశపాత్రునిపాలెం, పరవాడ ప్రాంతాల్లో నిత్యం కనిపిస్తున్నాయి. రోజురోజుకి గంజాయి, మందు, పేకాట బ్యాచ్‌లు పెరిగిపోతున్నాయి. చీకటి పడితే నాయుడుపాలెం శివారు బండారుపాలెం, వాడచీపురుపల్లి శివారు ఇస్సన్నపేట, పరవాడ-అనకాపల్లి, తానాం గ్రామాలకు వెళ్లే రహదారులు మందు, గంజాయి బ్యాచ్‌లతో కిటకిటలాడుతున్నాయి. లంకెలపాలెం, కలపాక, మంత్రిపాలెంతో పాటు మత్స్యకార గ్రామాల్లోని రహస్య ప్రాంతాలు పేకాట బ్యాచ్‌లకు అడ్డాగా మారిపోయాయి.



ముత్యాలమ్మపాలెం సామాజిక భవనం వద్ద చెల్లాచెదురుగా పడి ఉన్న పేక ముక్కలు

రైతుల గగ్గోలు..

గంగునాయుడుపాలెం, బండారుపాలెం గ్రామాల రైతులు సాగు చేస్తున్న జీడి తోటలు గంజాయి, పేకాట బ్యాచ్‌లకు అడ్డాగా మారిపోయాయి. ఆకతాయిలు ఉదయం నుంచి సాయంత్రం వరకు జీడి తోటల్లో పేకాట, మద్యం, గంజాయి సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడం వల్ల జీడి తోటలు మందు సీసాలు, గంజాయి, ఖైనీ ప్యాకెట్లతో నిండిపోతున్నాయని అక్కడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. సిగరెట్లు, బొప్పాయి కాడల్లో గంజాయి పెట్టి తాగుతూ మత్తులో జోగుతున్నారు. ఆకతాయిల చిల్లరి చేష్టలతో చీకటి పడితే రహదారిలో మహిళలు ఒంటరిగా రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. ఇవేం పనులంటూ అడిగిన రైతులు, గ్రామ ప్రజలపై ఆకతాయిలు దాడులకు దిగుతున్నారు.

షాపుల వద్ద అలజడి..

వాడచీపురుపల్లి గ్రామంలో గంజాయి, మందు బ్యాచ్‌లు పెట్రేగిపోతున్నాయి. షాపుల వద్ద అడిగిన వెంటనే అరువు ఇవ్వకపోతే గంజాయి, మందు బ్యాచ్‌లు గొడవలకు దిగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. మందు, గంజాయి బ్యాచ్‌లు దేశపాత్రునిపాలెం వైన్ షాపుల వద్ద ఏదో ఒక అలజడి సృష్టిస్తున్నాయి. గంజాయి, మద్యం మత్తులో పలు ప్రాంతాల్లో హత్యలకు తెగపడుతున్నారు. గొర్లివానిపాలెం జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీ, టిడ్కో కాలనీల్లో గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గంజాయి మత్తులో రాత్రీపగలు తేడా తెలియకుండా ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని అక్కడి మహిళలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటనలు ఉన్నాయి. గంజాయి, మందు బ్యాచ్‌లకు స్థానిక రాజకీయ నాయకులు వత్తాసు పలకడంతో ఆకతాయిలు మరింత రెచ్చిపోయి గొడవలకు పాల్పడుతున్నారు.



గంజాయి, ఆన్‌లైన్ గేమ్‌లు, రహదారి భద్రతపై ముత్యాలమ్మపాలెంలో యువతకు అవగాహన కల్పిస్తున్న పరవాడ సీఐ మల్లికార్జునరావు

ఆన్‌లైన్ బెట్టింగుల జోరు..

తీర ప్రాంతాల్లో ఆన్‌లైన్ బెట్టింగుల జోరు అధికంగా కనిపిస్తోంది. క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైతే చాలు కొన్ని బ్యాచ్‌లు ముబైళ్లను తీసుకుని రహస్య ప్రదేశాలకు వెళ్లిపోయి తమ కార్యకలాపాల్లో మునిగి తేలుతున్నారు. గంజాయి, మద్యం, ఆన్‌లైన్ బెట్టింగులపై పోలీసులు ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహించినా ఫలితం శూన్యం. మండలంలో రోజు రోజుకి పెరిగిపోతున్న గంజాయి, మద్యం, ఆన్‌లైన్, పేకాట బ్యాచ్‌లపై గట్టి నిఘా ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



గంజాయి, మద్యం, పేకాట, ఆన్‌లైన్ బెట్టింగులు, ఈవ్‌టీజింగ్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు. ఇటీవల పలు గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి నిందితులను అరెస్టు చేశాం. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ ఆధ్వర్యంలో మారుమూల మత్స్యకార గ్రామాలు, శివారు గ్రామాల్లో యువతకు అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి, మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నాం. గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, పేకాట శిబిరాలపై సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకుంటాం.

– ఆర్.మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

మర్యాదపూర్వక కలయిక



బొత్సతో అదీప్‌రాజ్, నాయకులు

పెందుర్తి: శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ (ఉత్తరాంధ్ర జోన్) అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం కలుసుకున్నారు. విజయనగరంలోని బొత్స నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తనకు పదవి రావడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసే దిశగా అదీప్‌రాజ్‌కు బొత్స పలు సూచనలు చేశారు. పార్టీ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు కోడిగుడ్ల దేవిసాంబ, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్‌కుమార్, పార్టీ పెందుర్తి మండల అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, వార్డుల అధ్యక్షులు రాపర్తి మాధవరావు, తామర్ల నర్సింగ్, పరవాడ మండల యువజన విభాగం అధ్యక్షుడు బండారు శ్రావణ్, అంబటి శైలేష్, వేపాడ శ్రీను, మణికంఠ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నారాయణరావు

పెందుర్తి: చినముషిడివాడలోని రాంపురంలో హెల్ప్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. గ్రామంలోని ప్రభుత్వ హెల్త్ క్లినిక్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అన్నంరెడ్డి అనంత్, డాక్టర్ గండి శ్రీనివాసరావు, డాక్టర్ గండి జ్యోతి రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు చేతుల మీదుగా ఉచితంగా మందులు అందించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెన్నెల సన్యాసినాయుడు, కొటాన దేముడుబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కోరుతూ ఆటో కార్మికుల నిరసన



ఉపాధి కోసం నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

పరవాడ: ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ నిరుద్యోగులుగా ఉన్న అనేక మంది బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల వద్ద అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి ప్రతి నెలా కిస్తీలు చెల్లించుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఉన్నారన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే ఆటో కార్మికుల ఉపాధికి విఘాతం కలుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఆటో కార్మికులు వ్యతిరేకం కాదన్నారు. అయితే ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. గ్యాస్‌పై విధించిన వ్యాట్ తగ్గించాలన్నారు. 2019లో తీసుకొచ్చిన జీవో 21ను రద్దు చేయాలని, పెంచిన అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలన్నారు. బ్యాంకుల ద్వారా ఆటోల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, రాము, అప్పలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండప వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రచారం



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా భూపేష్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

అల్లిపురం: స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వ్యవస్థ అంతా అదానీ చేతిలోకి వెళ్లిపోతుందని సీపీఎం సీనియర్ నాయకుడు వై. రాజు అన్నారు. జగాంబ జోన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కర్ర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం భూపేష్‌నగర్‌లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు సెల్‌ఫోన్ రీచార్జి చేసుకునే విధంగా ముందుగానే చేసుకోవాలని, ఎక్కువ ఏ టైములో విద్యుత్ వాడతామో ఆ టైంలో యూనిట్ రేట్ ఎక్కువగా చూపిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టిస్తే పగలగొట్టండి అని పిలుపునిచ్చిందన్నారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని స్మార్ట్ మీటర్లు పెట్టడానికి ప్రయత్నిస్తుందని ప్రశ్నించారు. భూపేష్‌నగర్ లో మహిళలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సీపీఎం ఇచ్చిన స్టిక్కర్లను స్వచ్ఛందంగా వాళ్ల మీటర్ పక్కనే అంటించి ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్లను అనుమతించబోమని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జగదాంబ జోన్ కన్వీనియన్స్ కమిటీ కన్వీనర్ ఎం. సుబ్బారావు పాల్గొన్నారు.

శబరిమలలో నిత్యాన్నదానానికి ఏర్పాట్లు



ట్రస్టు సమావేశంలో పాల్గొన్న పైలా ఆదిమోహన్‌రెడ్డి, ఇతర సభ్యులు

సీతంపేట: విశాఖలో నూతనంగా ప్రారంభించిన అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మండల, మకర జ్యోతి సీజన్లలో శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం అక్కడ నిత్యాన్నదానం నిర్వహించనున్నట్లు ట్రస్టు సభ్యుడు పైలా ఆదిమోహన్‌రెడ్డి తెలిపారు. శంకర మఠంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్ప భక్తులతో ట్రస్టు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వారా చేపట్టబోయే సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఏటా నవంబర్ 16 నుంచి జనవరి 17 వరకు శబరిమలలో తమ ట్రస్టు తరపున నిత్యాన్నదానాన్ని మూడు పూటలా నిర్వహిస్తామని చెప్పారు. భక్తులకు వైద్య సేవలందించేందుకు వీలుగా ఒక అంబులెన్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇతర రాష్ట్రాల వారికి బోర్డు సభ్యులుగా స్థానం కల్పిస్తున్న విధంగా తెలుగు రాష్ట్రాల వారికి ట్రావెన్‌కోర్ బోర్డులో అవకాశం కల్పించాలని కోరారు. ఇరు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ట్రావెన్‌కోర్ బోర్డును కోరనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రుద్ర కోటేశ్వరరావు, రాజేష్ గౌడ్, అనంతరావు, వైకుంఠరావు, శ్రీహరి, మస్తాన్‌రెడ్డి, రమణ, వీరాస్వామి పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్లో సైక్లింగ్ పోటీలు



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ గంగారావు, సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం స్లో సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టౌన్‌షిప్‌లో నిర్వహించిన 5 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీలో సేవ్ వైజాగ్ స్టీల్ అంటూ నినాదాలు చేశారు. ర్యాలీని ప్రారంభించిన 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా అభిప్రాయం వెల్లడించినా విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రతిఘటించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సీటూ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ కర్మాగారంలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తూ ప్లాంట్ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని ఆరోపించారు.

శుభ్రపడుతున్న నక్షత్రవనం



శుభ్రం చేసిన తర్వాత నక్షత్రవనం



బోర్డు తయారు చేస్తున్న కార్మికుడు

సాక్షి ఎఫెక్ట్..

సింహాచలం: సింహగిరిపై నక్షత్రవనాన్ని శుభ్రపరిచే చర్యలకు సింహాచలం దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. నక్షత్ర వనంలో ఉన్న సమస్యలు, భక్తులకు కలుగుతున్న అసౌకర్యాలను తెలియజేస్తూ ఈనెల 4న 'చుక్కలు చూపిస్తున్న సింహగిరి నక్షత్రవనం' పేరిట సాక్షి కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన దేవస్థానం ఈవో వి.త్రినాథరావు నక్షత్రవనాన్ని తిరిగి అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. నక్షత్రవనంలో ఉన్న చెత్తా చెదారాలు, తుప్పలను తొలగిస్తున్నారు. కొన్ని చెట్లకు పేర్లు లేకపోవడంతో బోర్డులు పెట్టేందుకు కొత్త బోర్డులు తయారు చేస్తున్నారు. అలాగే బోర్డులు ఉండీ చెట్లు లేని చోట్ల వాటిని ఏర్పాటు చేసే చర్యలు తీసుకున్నారు. అలాగే కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం పక్క నుంచి వెళ్లేందుకు ఉన్న మార్గాన్ని పునరుద్ధరించారు.

బ్లాక్ డే పాటించిన క్రైస్తవులు



మాట్లాడుతున్న క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ ప్రతినిధి సుధాకర్

డాబాగార్డెన్స్: క్రైస్తవులు ఆదివారం బ్లాక్ డే పాటించారు. 1950 ఆగస్టు 10న అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ మతం మారిన దళితులకు దళిత హోదా రద్దు చేశారని, అప్పటి నుంచి దళితులు బ్లాక్ డే పాటిస్తున్నారని క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ చైర్మన్ ఎం.సుధాకర్, కార్యదర్శి జేమ్స్ కుంపట్ల తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద బ్లాక్ డే పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ మతం నుంచి సిక్కు, బౌద్ధం ఇతర మైనార్టీ మతాల్లోకి మారిన దళితులకు 1956లో వెసులుబాటు కల్పించారని, హిందూ మతం నుంచి కేవలం క్రైస్తవ మతంలోకి మారే దళితులపై మాత్రమే వివక్ష కొనసాగుతుందన్నారు. 1971–77 మధ్య కాంగ్రెస్ పార్టీ క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు విద్య, ఉద్యోగ రంగాల్లో 1 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ, కార్పొరేషన్ లోన్లు, సబ్సిడీ, ఇళ్ల కాలనీలు, మంజూరు చేసినట్లు తెలిపారు. బ్లాక్ అంటే మతవివక్షగా క్రైస్తవులు భావిస్తారన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాల వికాస్ ఆధ్వర్యంలో జాతీయ పతాకోత్సవాలు

అగనంపూడి: భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలు, పంద్రాగస్టును పురస్కరించుకుని సత్యసాయి బాల వికాస్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ పతాకోత్సవాలు నిర్వహించారు. 85వ వార్డు కొండయ్యవలసలోని బాల వికాస్ కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బాలలకు జాతీయ నాయకుల వేషధారణ, భజన, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. బాల వికాస్ కేంద్రం ప్రాముఖ్యతను సత్యసాయి భజన మండలి ప్రతినిధులు విందుల రామారావు, వరహాలు వివరించారు. విద్యార్థి దశలోనే దేశభక్తి, స్వామి భక్తి, దైవచింతన, సేవా గుణం అలవర్చడం, అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, బాల వికాస్ గురువులు విందుల పద్మలత పాల్గొన్నారు.